క్లుప్తంగా

డెంగీపై అవగాహన ర్యాలీ



ప్రత్తిపాడు: మండల పరిధిలోని పెదగొట్టిపాడులో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో డెంగీపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. డెంగీ నివారణ మాసోత్సవంలో భాగంగా స్థానిక ఆరోగ్య ఉప కేంద్రం నుంచి మెయిన్ రోడ్డుతో పాటు అంతర్గత వీధుల్లో విద్యార్థులు, ఆరోగ్య సిబ్బంది ర్యాలీ చేశారు. దోమలు కుట్టకుండా దోమతెరలు వాడుదాం.. ఫ్రైడే డ్రైడే, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుదాం.. అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు దోమకాటు వలన ఎదురయ్యే అనర్థాలను ఆరోగ్య సిబ్బంది వివరించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈవో చెల్లమ్మ, సూపర్‌వైజర్లు, ఏఎన్ఎం కళావతి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వట్టిచెరుకూరు తహసీల్దార్‌గా నాగిరెడ్డి



ప్రత్తిపాడు: వట్టిచెరుకూరు మండల తహసీల్దార్‌గా ఎం.నాగిరెడ్డి మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఎన్నికల విధుల్లో భాగంగా నెల్లూరు జిల్లా నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చిన తహసీల్దార్లను వారి సొంత జిల్లాలకు పంపుతూ ఇటీవలే ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేయడంతో వారు నాలుగు రోజుల కిందట రిలీవ్ అయ్యారు.. ఈ నేపథ్యంలో మండల తహసీల్దార్‌గా నాగిరెడ్డి బాధ్యతలు స్వీకరించారు. కార్యాలయ సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతించారు.

ప్రత్తిపాడు తహసీల్దార్‌గా రవిబాబు



ప్రత్తిపాడు: ప్రత్తిపాడు తహసీల్దార్‌గా కె.రవిబాబు బాధ్యతలు స్వీకరించారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో బదిలీపై ప్రత్తిపాడుకు వచ్చిన తహసీల్దార్ పద్మజను జిల్లా ఉన్నతాధికారులు ఇటీవలే రిలీవ్ చేసిన విషయం తెలిసిందే. తాజాగా తహసీల్దార్‌గా రవిబాబును నియమించడంతో మంగళవారం ఆయన ఇక్కడ విధుల్లో చేరారు. ఎన్నికలకు ముందు రవిబాబు తెనాలిలో ఐదేళ్లకు పైగా పనిచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు, రైతులకు, ప్రజా ప్రతినిధులకు అందుబాటులో ఉంటానని చెప్పారు. సమస్యలుంటే నేరుగా తనను సంప్రదించాలని కోరారు.

కాకుమాను తహసీల్దార్‌గా వెంకటస్వామి



కాకుమాను: కాకుమాను మండల తహసీల్దార్‌గా బి.వెంకటస్వామి మంగళవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఆయన గుంటూరు కలెక్టరేట్‌లో సీసీగా పని చేస్తూ సార్వత్రిక ఎన్నికల బదిలీల్లో భాగంగా నెల్లూరు జిల్లా తహసీల్దార్‌గా బదిలీ అయ్యారు. కొద్ది రోజుల క్రితం జరిగిన సాధారణ బదిలీల్లో ఆయన కాకుమాను తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. కార్యాలయ సిబ్బంది తహసీల్దార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.

4న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

పొన్నూరు: మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం ఆగస్టు 4వ తేదీన నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రత్నజ్యోతి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు ఎంపీపీ భవనం పద్మలీల అధ్యక్షతన జరిగే సమావేశంలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ పాల్గొంటారని చెప్పారు. ఈ సమావేశంలో మండల పరిధిలోని అన్ని శాఖల అధికారులు పాల్గొనాలని కోరారు.

కుటుంబ కలహాలతోనే కార్మికురాలి ఆత్మహత్యాయత్నం

పొన్నూరు: పొన్నూరు పురపాలక సంఘం పరిధిలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికురాలు కుటుంబ కలహాలతోనే ఆత్మహత్యాయత్నానికి పాల్పడిందని మున్సిపల్ కమిషనర్ నయీం అహమ్మద్ తెలిపారు. ఆ కార్మికురాలు ఏ అధికారి ఇంటిలో పని చేయడం లేదని.. లైంగిక వేధింపుల కారణంగా కార్మికురాలు ఆత్మహత్యకు యత్నించిదని మంగళవారం సాక్షిలో ప్రచురితమైన వార్తకు కమిషనర్ వివరణ ఇచ్చారు. మున్సిపల్ కార్మికులు అధికారుల నివాసాలలో పనులు చేయరని, వారితో పనిచేయించుకుంటే శాఖపరంగా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

ఇదేం కర్మ..!?

- 'ప్రధానమంత్రి విశ్వకర్మ' దరఖాస్తులపై నిర్లక్ష్యం
- గ్రామస్థాయిలో విచారణ చెయ్యకుండానే తిరస్కరణ
- తిరస్కరించినట్లు దరఖాస్తుదారుల మొబైల్స్‌కు సందేశాలు
- బోరుమంటున్న దరఖాస్తుదారులు

Your application has not been recommended by Gram Pradhan. Please visit nearest CSC for further guidance. PM Vishwakarma - MSME

తిరస్కరించినట్లుగా లబ్ధిదారుల మొబైల్స్‌కు వస్తున్న సందేశం

ప్రత్తిపాడు: ప్రత్తిపాడుకు చెందిన శాలివాహన సామాజిక వర్గానికి చెందిన ఓ యువతి ప్రధాన మంత్రి విశ్వకర్మ పథకానికి దరఖాస్తు చేసుకుంది. అధికారులెవ్వరూ విచారణకు రాలేదు. కనీసం తనకు ఫోన్ కూడా చెయ్యలేదు. కానీ మీ దరఖాస్తు గ్రామ పంచాయతీ రికమండ్ చెయ్యలేదని మొబైల్‌కు సందేశం వచ్చింది. దీంతో ఆ యువతికి ఏం చేయాలో అర్థం కాక తలపట్టుకుని కూర్చుండిపోయింది. ఇది ఆ ఒక్క యువతి పరిస్థితి మాత్రమే కాదు. పథకానికి దరఖాస్తు చేసుకున్న పలువురి పరిస్థితి ఇదే.

ప్రధానమంత్రి విశ్వకర్మ పథకాన్ని 2023 సెప్టెంబర్‌లో ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించారు. ఈ పథకం ద్వారా స్వయం ఉపాధి ప్రాతిపదికన అసంఘటిత, అనధికారిక రంగం ఆధారంగా సంప్రదాయ వృత్తులలో ఒక దానిలో నిమగ్నమై చేతులు, పనిముట్లతో పని చేసే కళాకారులు, చేతి వృత్తుల వారికి ఆయా అంశాలపై శిక్షణ ఇచ్చి రూ.3 లక్షల వరకు రుణ సదుపాయాన్ని కల్పిస్తారు. ఇందులో లబ్ధిదారులు మొదటి విడత రుణం రూ.లక్ష, రెండవ విడత రుణం రూ.2 లక్షల వరకు పొందవచ్చు.

దరఖాస్తుల వివరాలు..


ప్రత్తిపాడు మండలంలో మొత్తం పదహారు గ్రామ పంచాయతీలున్నాయి. ఆయా పంచాయతీల్లో ఇప్పటి వరకు 1,298 మంది పీఎం విశ్వకర్మ పథకానికి దరఖాస్తు చేసుకున్నారు. 320 దరఖాస్తులను ఆమోదించగా, 625 దరఖాస్తులను తిరస్కరించారు. మిగిలిన 353 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి.

క్షేత్రస్థాయిలో విచారించకుండానే తిరస్కరణ..

పీఎం విశ్వకర్మకు దరఖాస్తు చేసుకున్న వారిని గ్రామ స్థాయిలో పంచాయతీ కార్యదర్శులు విచారించాల్సి ఉంది. నిజంగానే వారు వృత్తి చేసుకుంటున్నారా లేదా? పథకానికి అర్హులా కాదా అన్న విషయాలను పరిశీలించి, విచారించినట్లుగా దరఖాస్తుదారు నుంచి సంతకం తీసుకోవాలి. ఆ తరువాత దరఖాస్తు సర్పంచ్ లాగిన్‌కు వెళుతుంది. వారు దానిని ఆమోదించడమో తిరస్కరించడమో చేస్తారు. కానీ ఇవేమీ చెయ్యకుండానే కొన్ని గ్రామాల్లో దరఖాస్తుదారుల అర్జీలను రిజెక్ట్ చేసేస్తున్నారు. దీంతో వారి మొబైల్‌కు 'నీ అప్లికేషన్ గ్రామ పంచాయతీ రికమండ్ చెయ్యలేదంటూ' మెజేస్‌లు వస్తుండటంతో వారు లబోదిబోమంటున్నారు.

ఎవరెవరు దరఖాస్తు చేసుకోవచ్చు..

సంప్రదాయ చేతివృత్తులు చేసుకునే వడ్రంగులు, పడవలు, ఆయుధాలు, సుత్తులు, టూల్ కిట్లు, తాళాలు, బుట్టలు, చాపలు, చీపుర్లు, కాయిర్ వస్తువులు, చేపల వలలు, పూలదండలు తయారు చేసుకునేవారు, శిల్పులు, రాళ్లు పగలగొట్టేవారు, స్వర్ణకారులు, కుమ్మరులు, చెప్పులు కుట్టేవారు, పాదరక్షల కళాకారులు, తాపీ మేస్త్రీలు, బొమ్మల తయారీదారులు, క్షురకులు, చాకలివారు, దర్జీలు, కళాకారులు దరఖాస్తు చేసుకోవచ్చు.



ప్రధానమంత్రి విశ్వకర్మ పథకం బ్రోచర్

కచ్చితంగా ఫీల్డ్ లెవల్‌లో విచారించాలి



పీఎం విశ్వకర్మ అర్జీలను కచ్చితంగా ఫీల్డ్ లెవల్లో దరఖాస్తుదారుల వద్దకు వెళ్లి విచారించాలి. వారు అర్హులా కాదా అన్నది స్వయంగా నిర్ధారించుకోవాలి. అలా చెయ్యకుండా రిజెక్ట్ చేయడం సరి కాదు. అలాంటివి ఏమైనా ఉంటే పరిశీలించి చర్యలు తీసుకుంటాం.

– షేక్ ఖాజా, ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ, ప్రత్తిపాడు

ఆటవిక పాలన చేస్తున్న కూటమి ప్రభుత్వం

పొన్నూరు వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ



పొన్నూరు: రాష్ట్రంలో జరుగుతున్న దాడులు, హత్యలు, దౌర్జన్యాలు, విధ్వంసాలు ఆటవిక పాలనను తలపిస్తున్నాయని మంగళవారం ఒక ప్రకటనలో పొన్నూరు వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ విమర్శించారు. ఆదాయ, వ్యయాలు చెప్పాల్సి వస్తుందని ఎత్తుగడతో చంద్రబాబు ప్రభుత్వం పూర్తిస్థాయిలో బడ్జెట్‌ను ప్రవేశపెట్టకుండా మరో మూడు నెలలు ఓటాన్ అకౌంట్‌కి వెళ్లిందని పేర్కొన్నారు. ఏడు నెలల పాటు ఓటాన్ అకౌంటు బడ్జెట్‌కు వెళ్లడం బహుశా ఎన్నడూ జరగలేదన్నారు. ఎన్నికల నుంచి చంద్రబాబు, పచ్చ మీడియా ఈ రాష్ట్రానికి ఉన్న అప్పులు రూ.14 లక్షల కోట్లని ఊదరగొట్టారని, కానీ అధికారంలోకి వచ్చాక ఆ అంకెలు కనిపించడం లేదని విమర్శించారు. గవర్నర్‌తో కూడా అబద్ధాలు చెప్పించిన ఘనత చంద్రబాబుకే దక్కిందన్నారు.

పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెడితే సూపర్ సిక్స్ పథకాలకు ఎంత ఖర్చు పెడుతున్నారో చంద్రబాబు ప్రజలకు చెప్పాల్సి వస్తుందని పూర్తి స్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని దుయ్యబట్టారు. రాష్ట్రంలో జరుగుతున్న ఘటనలను ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో ఇప్పటికే అమ్మఒడి, రైతు భరోసా, ఫీజు రీయింబర్స్‌మెంట్, పంటల బీమా ప్రీమియం చెల్లించడం జరిగిందన్నారు. గత ఐదేళ్లలో సంక్షేమ పాలన అందించిన ఘనత వైఎస్ జగన్‌కే దక్కిందన్నారు.

ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనది

గుంటూరు జిల్లా ఉప విద్యాశాఖాధికారి వెంకటేశ్వరరావు

ప్రత్తిపాడు: ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనదని జిల్లా ఉప విద్యాశాఖాధికారి ఎం.వెంకటేశ్వరరావు అన్నారు. వట్టిచెరుకూరు మండలం వింజనంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బయలాజికల్ సైన్స్ ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న ఎం.ఎలిజబెత్ రాణి నేటితో ఉద్యోగ విరమణ చేయనున్నారు. మంగళవారం స్థానిక పాఠశాలలో హెచ్ఎం ఝాన్సీరాణి ఆధ్వర్యంలో ఎలిజబెత్ రాణి పదవీ విరమణ సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డిప్యూటీ ఈవో దుశ్శాలువా, పూలమాలలు, మెమొంటోలతో ఎలిజబెత్ రాణిని సత్కరించారు. ఆయన మాట్లాడుతూ ఎలిజబెత్ రాణి ఉపాధ్యాయ వృత్తికే వన్నె తీసుకువచ్చారన్నారు. విద్యార్థులకు విద్యా బుద్ధులను, క్రమశిక్షణను, నైతిక విలువలను నేర్పి, సమాజానికి ఉత్తమ పౌరులను అందించే అనిర్వచనీయమైన బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తించారని చెప్పారు. 34 సంవత్సరాలుగా ఉపాధ్యాయ వృత్తిలో ఉంటూ ఎందరో విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దారని కొనియాడారు. ఎంఈవో సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ విద్యాభివృద్ధికి ఎలిజబెత్ కృషి చేశారన్నారు. ఎంఈవో–2 నిర్మల మాట్లాడుతూ సమర్థవంతంగా విధులు నిర్వహించినప్పుడు అందరి మన్ననలు పొందుతామన్నారు. కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ గేరా మోహనరావు, ఉపాధ్యాయులు శైలజ, డి.చంద్రిక, శివకుమారి, వీరయ్య, నాగమల్లేశ్వరరావు, గ్రామ పెద్దలు చింపిరయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

సెయింట్ ఆన్స్‌లో క్యాన్సర్‌పై అవగాహన సదస్సు



అవగాహన సదస్సులో కళాశాల యాజమాన్యం, విద్యార్థులు

గుంటూరు రూరల్: ఆరోగ్యం పట్ల ప్రతి ఒక్కరూ బాధ్యతగా అవగాహనతో ఉండాలని రమేష్ ఆసుపత్రి గైనకాలజిస్ట్ డాక్టర్ డి.అనిత తెలిపారు. మంగళవారం గోరంట్ల గ్రామంలోని సెయింట్ ఆన్స్ మహిళా కళాశాలలో సర్వైకల్ క్యాన్సర్‌పై అవగాహన సదస్సును నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ వ్యాధి నిర్ధారణ, ప్యాప్ స్మియర్ విధానం, వ్యాక్సినేషన్ గార్డసిల్ సర్వేనెక్స్, వ్యాక్సిన్‌లను 9 నుంచి 45 సంవత్సరాల మధ్య వయసు కలిగిన వారు తీసుకోవాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ రెవరెండ్ సిస్టర్ సంధ్య విద్యార్థులు ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండి ఎటువంటి సమస్య ఎదురైనా వైద్యుల సలహాలను పాటించి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఆర్ షారోన్‌రోజ్, బి.జూయిస్, జి.సరోజ, సీహెచ్ స్వర్ణ, చరణిరామ్, ఆర్ ఫణిరాజ్యలక్ష్మి, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

హెచ్ఈ పాఠశాలలో విచారణ

సాక్షి ఎఫెక్ట్



తల్లిదండ్రులను విచారిస్తున్న ఎంఈవోలు రమాదేవి, లీలారాణి

ప్రత్తిపాడు: విద్యార్థుల నుంచి డబ్బులు వసూలు చేయడం మంచి పద్ధతి కాదని ఎంఈవోలు సీహెచ్ రమాదేవి, లీలారాణిలు తెలిపారు. నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులోని హెచ్ఈ ప్రాథమిక పాఠశాలలో సోమవారం తిథి భోజనం పేరుతో ఉపాధ్యాయులు విద్యార్థుల నుంచి డబ్బులు వసూలు చేశారంటూ ఈ నెల 30వ తేదీన 'సాక్షి'లో ప్రచురితమైన 'తిథి భోజనం.. పైసా వసూల్..!' శీర్షికన కథనం ప్రచురితమైన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో జిల్లా విద్యాశాఖాధికారి శైలజ డబ్బుల వసూళ్లపై విచారణ జరిపి నివేదిక అందజేయాలని ఆదేశించడంతో మంగళవారం ఉదయం ఎంఈవోలు పాఠశాలకు వెళ్లారు. ఉదయం హెచ్ఎం, ఉపాధ్యాయులతో మాట్లాడారు. ఎందుకు డబ్బులు వసూలు చేశారని ప్రశ్నించారు. సాయంత్రం విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించి ఎందుకు పిల్లలకు డబ్బులిచ్చి పంపారని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల నుంచి వేర్వేరుగా లిఖితపూర్వక స్టేట్‌మెంట్లు రికార్డు చేశారు. వాటితో పాటు ప్రత్యేక నివేదిక తయారు చేసి డీఈవోకు అందించనున్నట్లు ఎంఈవోలు రమాదేవి, లీలారాణిలు తెలిపారు.

చేబ్రోలు వాసికి చెన్నై వర్సిటీ పీహెచ్‌డీ

గుంటూరు ఎడ్యుకేషన్: చెన్నైలోని శ్రీరామచంద్ర ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్ రీసెర్చ్ నుంచి 'న్యూరో ఎవల్యూషన్ ఆఫ్ న్యూరో సైక్రాటిక్ ప్రాపర్టీస్ ఆఫ్ ఇన్ బిహేవియర్ మోడ్స్ ఆఫ్ మైస్' అనే అంశంపై చేసిన పరిశోధనకు గాను చేబ్రోలు మండలం కొత్తరెడ్డిపాలేనికి చెందిన కంచర్ల నాగరాజు పీహెచ్‌డీ పట్టా అందుకున్నారు. రాజమహేంద్రవరంలోని జీఎస్ఎల్ మెడికల్ కళాశాలలో అసిసోసియేట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న నాగరాజు శ్రీరామచంద్ర వర్సిటీ ఫార్మా విభాగ ఆచార్యులు డాక్టర్ అనూష పర్యవేక్షణలో చేసిన పరిశోధనకు ఆయన ఇటీవల పీహెచ్‌డీ పట్టా పొందారు.

విద్యాభివృద్ధికి ఉపాధ్యాయులు కృషి చేయాలి

ఎంఈవో కెనడీ



లింగంగుంటపాలెం(కాకుమాను): విద్యార్థుల విద్యాభివృద్ధికి ప్రతి ఉపాధ్యాయులు కృషి చేసి వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని ఎంఈవో కె.ఎఫ్.కెనడీ అన్నారు. మండలంలోని లింగంగుంటపాలెం మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలను మంగళవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు ప్రభుత్వ పాఠశాలలు ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ఉన్న విషయాన్ని తల్లిదండ్రుల దృష్టికి తీసుకువెళ్లి విద్యార్థుల చేరికలు పెంచాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థుల ప్రగతి, పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఉన్నారు.

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత



మొక్కను నాటుతున్న ఎంఈవో విజయ్‌భాస్కర్

కాకుమాను: పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత సమాజంలో ప్రతి ఒక్కరిపై ఉందని ఎంఈవో–2 విజయ్ భాస్కర్ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఇన్‌స్టిట్యూషన్ ప్లాంటేషన్ కార్యాక్రమంలో భాగంగా మంగళవారం మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలతోనే మానవ మనుగడ ఆధారపడి ఉందని వాటిని సంరక్షించడంతో సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ఆయన తెలిపారు. విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు ఒక్కో మొక్కను నాటి వాటిని సంరక్షించాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో వివిధ రకాల మొక్కలను నాటారు. కార్యక్రమంలో ఎంపీడీవో పి.రామకృష్ణ, హెచ్ఎం బి.సత్యం, మామిళ్లపల్లి రాంగోపాల్, నల్లమోతు పూర్ణచంద్రరావు, నువ్వుల సునీల్ చౌదరి, బోడపాటి ప్రసాద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

ప్రస్తుత ఎమిషన్స్ నిబంధనల ప్రభావంపై వర్క్‌షాప్



మాట్లాడుతున్న కేవీకే ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ యుగంధర్‌కుమార్

గుంటూరు రూరల్: నగర శివారుల్లోని లాంఫాంనందున్న కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే)లో వివిధ వ్యవసాయ యంత్ర పరికరాలలో ప్రస్తుత ఎమిషన్స్ నిబంధనల ప్రభావంపై సర్వే గురించి వర్క్ షాప్ నిర్వహించారు. మంగళవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో కేవీకే ప్రిన్సిపల్ సైంటిస్ట్, హెడ్ డాక్టర్ ఎం.యుగంధర్‌కుమార్ మాట్లాడుతూ సర్వే ముఖ్య లక్ష్యాలను వివరించారు. రైతులు, ట్రాక్టర్ డీలర్స్, ఇతర భాగస్వాముల అభిప్రాయాలను సేకరించారు. ట్రాక్టర్, మెకనైజేషన్ అసోసియేషన్ కన్సల్‌టెంట్ ఆర్ దివ్య రవిచంద్రన్, అగ్రి బిజినెస్ మేనేజ్‌మెంట్ మేనేజర్ ఎస్ రవికుమార్ ఈ సర్వే ఉద్దేశాన్ని తెలియజేశారు. ట్రాక్టర్ డీలర్స్ వ్యక్తపరిచిన అంశాల్లో స్టేజ్ 3 నుంచి స్టేజ్ 5కి మార్చడం ద్వారా ఖర్చు పెరుగుతుందని తెలిపారు. వాటిని కొనే రైతులు తగ్గిపోతారన్నారు. ప్రతి డీలర్‌షాప్‌లో గ్రామాలకు దగ్గరలో స్టేజ్ 5 ట్రాక్టర్లను రిపేర్ చేయగలిగిన టెక్నీషియన్‌లను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. ప్రభుత్వం నుండి సబ్సిడీ, జీఎస్టీ తగ్గించినట్లయితే ఎక్కువ మంది రైతులు స్టేజ్ 5 ట్రాక్టర్లను కొనగలరని తెలియజేశారు. ఈ కార్యక్రమం ద్వారా రైతులు, వ్యవసాయ యంత్ర పరికరాల డీలర్లు, అనుబంధ సంస్థల నుంచి సేకరించిన సమాచారాన్ని డిపార్ట్‌మెంట్ ఆఫ్ అగ్రికల్చర్ అండ్ ఫార్మర్స్ వెల్ఫేర్‌కు నివేదికగా అందజేస్తామని కేవీకే శాస్త్రవేత్తలు తెలిపారు. కార్యక్రమంలో కేవీకే సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఎం.గంగాదేవి, శాస్త్రవేత్త డాక్టర్ సీహెచ్ అనిల్ కుమార్, రైతులు, ట్రాక్టర్ డీలర్స్ పాల్గొన్నారు.

ఆర్‌వీఆర్‌జేసీలో అంకుర పరిశ్రమల స్థాపనపై సదస్సు



అతిథిని సత్కరిస్తున్న కళాశాల యాజమాన్యం

గుంటూరు రూరల్: విద్యార్థులు వినూత్న ఆలోచనలతో ప్రజానీకానికి అవసరమయ్యే యాప్‌ల రూపకల్పన చేయాలని ఎంఎక్స్ ఏవియేషన్ సొల్యూషన్స్ (అమెరికా) వ్యవస్థాపకుడు సీఈవో దినకరలక్ష్మణ నాగళ్ల తెలిపారు. మంగళవారం చౌడవరం గ్రామంలోని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన టర్నింగ్ ఐడియాస్ ఇన్ టూ ఇన్వెస్ట్‌మెంట్స్ రోడ్ మ్యాప్ టూ అట్రాక్ట్ ఇన్వెస్టర్స్ సెమినార్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ విద్యార్థి ఆలోచనలను పెట్టుబడులుగా మార్చి సమాజ హిత వ్యాపారాన్ని విజయపథంలో నడపాలని కోరారు. అంకుర పరిశ్రమల స్థాపనలోని వివిధ దశలను, వాటి విజయానికి పాటించాల్సిన పద్ధతులను వివరించారు. అందుబాటులో ఉన్న యాప్‌లలో తక్కువ శాతం మాత్రమే ఉపయోగంలో ఉన్నాయని, నిత్యం మారుతున్న టెక్నాలజీని అందిపుచ్చుకోవాలని సూచించారు. విద్యార్థులు ఎంచుకున్న రంగంలో లక్ష్య సాధన దిశగా నేటి నుంచే ప్రణాళికను రూపొందించుకోవాలని కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్ శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ జగదీష్ కె మద్దినేనిలు అన్నారు. సాంకేతిక వ్యాపార రంగంలో అంతర్జాతీయ స్థాయిలో కీర్తింపబడుతున్న దినకరలక్ష్మణ నాగళ్ల తమ కళాశాల పూర్వ విద్యార్థి కావడం ఆనందదాయకమని కళాశాల సెక్రటరీ కరెస్పాండెంట్ ఆర్ గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్‌లు తెలిపారు. అతిథిని కళాశాల యాజమాన్యం సత్కరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్, డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, ఏవో డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు, డాక్టర్ కె.స్వర్ణశ్రీ, డాక్టర్ ఎంపీపీ చంద్రశేఖర్, డాక్టర్ డీవీవీ కృష్ణప్రసాద్, ఐటీబీఐ సీఈవో మహేంద్రవర్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్‌వీఆర్‌జేసీలో నూరు శాతం సీట్లు భర్తీ

గుంటూరు రూరల్: ఇంజనీరింగ్ కళాశాలల్లో ప్రవేశానికి నిర్వహించే ఏపీ ఎంసెట్ కన్వీనర్ కోటా ఫైనల్ అలాట్‌మెంట్‌ను రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం విడుదల చేసిందని తమ కళాశాలలో నూరు శాతం సీట్ల భర్తీ పూర్తయిందని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజనీరింగ్ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్ శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు జె.మురళీమోహన్, డాక్టర్ జగదీష్ కె మద్దినేనిలు తెలిపారు. 2024–25 విద్యా సంవత్సరంలో కన్వీనర్ కోటాలో 1290 సీట్లకుగానూ 1296 సీట్లు గత ఏడాది ర్యాంకులకన్నా ముందు ర్యాంకులతో భర్తీ అవ్వటం సంతోషంగా ఉందని కళాశాల కార్యదర్శి ఆర్ గోపాలకృష్ణ, కోశాధికారి డాక్టర్ కె కృష్ణప్రసాద్‌లు తెలిపారు. కంప్యూటర్ కోర్సులకు డిమాండ్ ఉన్న ప్రస్తుత పరిస్థితుల్లో కంప్యూటర్ కోర్సులతోపాటు సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్, కెమికల్ కోర్సుల్లో పూర్తిగా సీట్లు భర్తీ అవ్వటం శుభపరిణామమని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్, డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర, ఏవో డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాసరావులు తెలిపారు.

నండూరులో విషాదం

పొన్నూరు: మండలంలోని నండూరు గ్రామంలో విషాదం నెలకొంది. గ్రామంలోని వేర్వేరు కుటుంబాలకు చెందిన ఇద్దరు యువకులు చెడు వ్యసనాలకు బానిసలవుతున్నారని తల్లిదండ్రులు మందలించడంతో మనస్తాపానికి గురై గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన తెలిసిందే. అయితే పొన్నూరు ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతున్న ఇద్దరిలో ఒకరు మృతి చెందారు. ఒకే రోజు ఇరువురు ఆత్మహత్యకు పాల్పడి ఒకరు మరణించిన ఘటన గ్రామస్తులను కలచివేసింది.


రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు



తీవ్ర గాయాలపాలైన వెంకటేశ్వర్లు

ప్రత్తిపాడు: హైవేపై ద్విచక్రవాహనం అదుపుతప్పి కిందపడటంతో ఓ వ్యక్తి తీవ్ర గాయాలపాలైన ఘటన మండల పరిధిలో చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. గుంటూరు రూరల్ మండలం బుడంపాడుకు చెందిన భార్యాభర్తలు మాతంగి వెంకటేశ్వర్లు, భూషణకుమారిలు మంగళవారం ఉదయం తమ ఇంటి నుంచి పల్నాడు జిల్లా చిలకలూరిపేట సమీపంలోని గణపవరంకు ద్విచక్రవాహనంపై బయల్దేరారు. మార్గంమధ్యలో ప్రత్తిపాడు మండలం పార్వతీపురం 16వ నంబరు జాతీయ రహదారిపై బైక్ అదుపుతప్పి కింద పడిపోయారు. ప్రమాదంలో వెంకటేశ్వర్లుకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108కు ఫోన్ చేయడంతో చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. దీనిపై రాత్రి వరకు పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

కేవీకేలో ఆధునిక వ్యవసాయ పద్ధతులపై శిక్షణ



శిక్షణ తరగతుల్లో రైతులతో కేవీకే ప్రిన్సిపల్ సైంటిస్ట్ యుగంధర్‌కుమార్

గుంటూరు రూరల్: ప్రత్తిపాడు మండలంలోని తుమ్మలపాలెం, ఈదులపాలెం గ్రామాల రైతులకు వాటర్ ఎయిడ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో లాంఫాం నందున్న కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే)లో నీటిపారుదల, ఆధునిక వ్యవసాయ పద్ధతులపై శాస్త్రవేత్తలతో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. మంగళవారం జరిగిన ఈ శిక్షణ తరగతులలో కేవీకే ప్రిన్సిపల్ సైంటిస్ట్ యుగంధర్‌కుమార్, సీనియర్ శాస్త్రవేత్త గంగాదేవిలు డ్రిప్, స్ప్రింక్లర్స్ ఇరిగేషన్ పద్ధతుల ద్వారా నీరు వృథా కాకుండా తగిన మోతాదులో మొక్కకు మాత్రమే నీరు అందిస్తూ అధిక రాబడి పొందే మార్గాలను వివరించారు. ప్రతి రైతు డ్రిప్ ఇరిగేషన్‌పై దృష్టి సారించాలన్నారు. ఈ పద్ధతి ద్వారా కలుపు మొక్కలు పెరగవన్నారు. ప్రతి రైతు ఫారం పాండ్ ద్వారా వర్షపు నీరు భద్రపరచి డ్రిప్, స్ప్రింక్లర్స్‌తో సాగు చేయాలన్నారు. దీని ద్వారా నీటి ఎద్దడి తలెత్తకుండా భవిష్యత్ తరాలకు నీరు అందించవచ్చన్నారు. ఈ సాగు వైపు రైతులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం హార్టికల్చర్ ద్వారా అధిక సబ్సిడీ ఇస్తుందన్నారు. ప్రతి రైతు నీటిని పొదుపుగా వినియోగించే పద్ధతులపై దృష్టి పెట్టాలన్నారు. నీటిని పొదుపుగా ఉపయోగించే పద్ధతులపై గ్రామస్థాయిలో సమావేశాలను ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త సీహెచ్ అనిల్ కుమార్, వాటర్ ఎయిడ్ ప్రతినిధి వేణు తదితరులు పాల్గొన్నారు.

